



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి గంగారావు, తదితరులు

ఎన్నికల నిబంధనలను పాటించాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కడప-అనంతపురం- కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, కర్నూలు లోకల్ అథారిటీస్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ , కర్నూలు లోకల్ అథారిటీస్ ఎన్నికల పటిష్ట నిర్వహణపై జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డితో కలిసి సమీక్షించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించామన్నారు. శాంతి భద్రతలు, ఎన్నికల నియమావళి అమలు, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ పేపర్ మేనేజ్‌మెంట్, బ్యాలెట్‌బాక్సుల సేకరణ, ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్స్, మైక్రో అబ్జర్వర్‌వర్ల నియామకం తదితర అంశాలకు సంబంధించి నోడల్ అధికారులు నిర్దేశించిన విధంగా ప్రణాళికా బద్ధంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 74 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 7 నాటికి



కలెక్టరేట్ సిబ్బందితో సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు

61,684 మంది ఓటర్లు ఉన్నారన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 27 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, ఫిబ్రవరి 7 నాటికి 5,364 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కర్నూలు లోకల్ అథారిటీస్‌కు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆరు ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పక్కాగా అమలు పరిచేందుకు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్స్, జోనల్, సెక్టోరల్ అధికారులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో సర్వే సిబ్బంది సహకారంతో ఎంట్రీ, ఎగ్జిట్ మార్కింగ్ చేయించాలన్నారు. కాంపౌండ్ వాల్, వెంటిలేషన్, తాగు నీరు, ర్యాంప్ తదితర మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల నుండి సిబ్బంది వివరాలు తెప్పించుకొని ఎన్నికల విధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఎఒను కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సరళిపై సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్‌కౌంటర్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, బ్యాలెట్‌బాక్సులు అన్నీ సిద్ధం చేసుకోవాలని సూచించారు..

కలెక్టరేట్ సిబ్బందితో సమీక్ష

అనంతరం కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బందితో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమావేశమయ్యారు. ఎన్నికల విధుల నిర్వహణపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ముగిసేంతవరకు కలెక్టరేట్లోని సెక్షన్ అధికారులు,ఉద్యోగులు తమ విధులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కర్నూలు డిఆర్ఒ నాగేశ్వరరావు, నంద్యాల డిఆర్ఒ పుల్లయ్య, ఆర్‌డిఒలు నోడల్ అధికారులు జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్‌రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, మల్లిఖార్జునుడు, ఎస్‌డిసి రమ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీగా బతకాలి

- కార్పొరేట్ విద్యతో సన్నగిల్లుతున్న ప్రేమానురాగాలు
- కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో హైకోర్టు జడ్జి గంగారావు

ప్రజాశక్తి-తుగ్గలి

ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీగా బతకాలని, ముఖ్యంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని హైకోర్టు జడ్జి, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.గంగారావు సూచించారు. కార్పొరేట్ విద్యతో తల్లిదండ్రులతో పిల్లలకు ప్రేమానురాగాలు సన్నగిల్లుతున్నాయని అన్నారు. శనివారం తుగ్గలి మండలం పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-1977 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పూర్వ విద్యార్థి కారం భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో జస్టిస్ గంగారావు మాట్లాడుతూ విద్యార్థులు జాగ్రత్తగా చదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని అన్నారు. మానవత్వం ప్రస్తుతం పూర్తిగా తగ్గిపోయిందని అన్నారు. మనిషి మనిషికి వైరం పెరుగుతుంది తప్ప ప్రేమానురాగాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజలకు స్వార్థం పెరిగిపోయి కరుణ, దయ, ప్రేమ, మానవత్వం లేకుండా పోయిందన్నారు. విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలో చదవడం వల్ల తల్లిదండ్రుల ప్రేమానురాగాలు కోల్పోతాం న్నారు. ఆర్థికంగా దెబ్బతీయడమే కాకుండా విద్యార్థులకు తల్లిదండ్రులు దూరమైపోతారన్నారు. పిల్లల పట్ల ఆసక్తి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటినుండి చదువుపై ఆసక్తి కనపరచాలన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయన్నారు. తాను ఇదే పాఠశాలలో పూరి గుడిసెలో ఉండి చదివి ఉన్నత శిఖరానికి వెళ్లానన్నారు. మంచితనానికి ఎప్పుడు విలువ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సంస్కారవంతులు కావాలని కోరారు. తాను చదివిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలన్న తపన ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతి పేదవాళ్లు వసతి గృహంలోనే చదవాల్సి వస్తుందన్నారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. ప్రతి గ్రామంలో పాఠశాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థి, సీనియర్ టిడిపి నాయకులు కారం భాస్కర్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆర్‌డిఒ మోహన్ దాస్, తహశీల్దార్ రవి, సొసైటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, సర్పంచి హారిక రెడ్డి, సర్పంచి గౌరవ సలహాదారు సుధాకర్ రెడ్డి, పత్తికొండ మార్కెటింగ్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం రెడ్డి, అట్లా బసిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు మైకిల్, విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, వివిధ బ్యాచ్లకు చెందిన పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు హైకోర్టు జడ్జి గంగారావును సన్మానించారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవిని హైకోర్టు జడ్జికంగారావు సన్మానించారు.

జీతాల చట్టం వస్తేనే ఉద్యోగులకు ఆర్థికభద్రత

ఉద్యోగ సంఘాలన్ని ఒకే వేదికపై రావాలి : ఎపిజిఇఎ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించే జీతాల చట్టం వస్తేనే ఉద్యోగులకు ఆర్థిక భద్రత ఉంటుందని ఆ దిశగా ప్రతి ఒక్క ఉద్యోగి పోరాడాలని ఆ హక్కును సాధించుకోవాలని ఈ నిర్ణయానికి అన్ని ఉద్యోగ సంఘాలు ఒకే వేదికపైకి రావాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ అన్నారు. జీతాలు- బకాయిలు, చెల్లింపులు - చట్టబద్ధత అనే అంశంపై శనివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సిక్యాంప్ లోని డ్రైవర్స్ అసోసియేషన్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చా వేదికలో పలువురు ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ సకాలంలో జీతాలు, బకాయిలు చెల్లించేలా చట్టం చేయాలని చర్చావేదికలో ఉద్యోగులు మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు ,జడ్జీలు, ముఖ్యమంత్రులు ఇలా ప్రతి ఒక్కరి జీతభత్యాలు ఇవ్వడానికి ప్రత్యేక చట్టమే ఉందని, అలాంటిది ప్రభుత్వ ఉద్యోగులకు ఒక చట్టాన్ని సాధించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. నెల రోజులు పని చేసి ఒకటవ తేదీన జీతం కోసం ఎదురు చూడటం కష్టపడిన పనికి వేతనం అడిగే హక్కు కూడా లేకుండా ఉందన్నారు. ఒకటవ తేదీన వేతనాలు ఇవ్వాలనే హక్కును సాధించుకోవాలని, అందుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తీర్మానించామన్నారు. కొన్ని ఉద్యోగ సంఘాలు ఇక్కడ ఒక మాట అక్కడ ఒక మాట మాట్లాడుతూ ఉద్యోగుల పొట్ట కోడుతున్నా రన్నారు. జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ నేతృత్వం వహించిన ఈ చర్చా వేదికకు మెడికల్, ప్రజారోగ్య, కమర్షియల్ టాక్సెస్, ఇరిగేషన్, విమెన్ వెల్ఫేర్, రెవిన్యూ, ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ తోపాటు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సెక్రటరి వెంకటరమణ, సిటీ అధ్యక్ష జి. కృష్ణమూర్తి, చిన్నికృష్ణ, వాణిజ్య పన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దశరథ రఘు రామిరెడ్డి, ఎపిజిఇఎ జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహులు తోపాటు సోమేశ్వరి, డిఎస్.మూర్తి, రిటైర్ట్ సిఐ రంగారెడ్డి, లెక్చరర్ సి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్

గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి అంగన్వాడి సిబ్బందిని కోరారు. శనివారం ఆమె కర్నూలు జిల్లాలో ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా వెల్దుర్తి మండలంలోని కలుగొట్ల అంగన్వాడీ కేంద్రం, కర్నూలు నగరంలోని నిర్మల్ నగర్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో డైరెక్టర్ సిరి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రతినెల గర్భవతులకు అందజేయాలన్నారు. మహిళలల్లో రక్తహీనత నివార ణకు, ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చేందుకు ప్రభుత్వం ముందుజాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. పిల్లలకు కూడా మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టాలన్నారు. మెనూ తప్పనిసరిగా పాటి ంచాలని సూచించారు. ఆళ్లగడ్డ కర్నూలు అర్బ న్ సిడిపిఒ అనురాధ, కర్నూలు రూరల్ సిడిపిఒ నాగ మణి, అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులతో మాట్లాడుతున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి

'భద్ర'త కోసం ఉద్యమం



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు ప్రధాన నీటి వనరు. అలాంటి దాని నుండి మూడు జిల్లాలకు నీరు కరువయ్యే పరిస్థితి ఏర్పడనుంది. అందుకు ప్రధాన కారణం భద్ర ఎగువ వైపున కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.5300 కోట్లు కేటాయించడమే. తుంగభద్ర డ్యామ్ పైన తుంగ, భద్ర నదులు రెండూ కలసి తుంగభద్రగా హోస్పేట్ వద్ద ఏర్పడుతాయి. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాలకు నీటిని అందించే బహుళార్థక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో 130 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. అయితే పూడిక కారణంగా ప్రస్తుతం దీని నీటి నిలువ సామర్థ్యం 100 టిఎంసిలకు పరిమితమైంది. ఈ ప్రాజెక్టు నుంచి కర్నూలు జిల్లాకు నీటిని అందించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్‌ఎల్‌సి)కి 24 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువ సామర్థ్యం తగ్గడంతో ఇప్పుడు ఏటా సగటున దామాషా పద్ధతిలో కేటాయిస్తున్న నీరు 18 టిఎంసిల నుంచి 20 టిఎంసిల వరకే ఉంటోంది. వాస్తవానికి కర్ణాటక ప్రభుత్వం కడుతున్న అప్పర్ భద్రకు ఎలాంటి అనుమతులు లేవు. సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. అలాంటి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి భారీ ఎత్తున నిధులు కేటాయించడం బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేస్తున్న ఎన్నికల స్టంట్ గా రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే తుంగభద్ర నుండి నీరు తక్కువగా వస్తు న్నాయి. భవిష్యత్తులో అప్పర్ భద్ర ప్రాజెక్ట్ పూర్తి అయితే దిగువకు నీరు రావడం కష్టతరంగా మారుతుంది. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారనుంది. దీనిపై వామపక్ష, ఇతర రైతు సంఘాలు ఆందోళన బాట పట్టనున్నాయి. దీనిపై ఇప్పటికే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ దగ్గర ఈ నెల 13న నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. రాయలసీమకు సాగు, తాగు నీరు అందాలంటే అప్పర్ భద్రను అడ్డుకునేందుకు సీమలోని పిల్లాజల్లా, కార్మికులు, కర్షకులు అందరూ కదలాలి. మన నీటి వాటా హక్కును కాపాడుకోవాలి.

సిపిఎస్ రద్దు కోసం పోరాటం : సిపిఎస్ రద్దు చేస్తామని సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేసిన పాద యాత్రలో ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఆ హామీ నెరవేరలేదు. దాంతో యుటిఎఫ్ మళ్ళీ పోరాటానికి శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలో దీక్ష చేపట్టారు.

అంగన్వాడీల ఆగ్రహం : ప్రభుత్వం తీరుపై అంగన్వాడీ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకి అంగన్వాడీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారు. అయినా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవు. కొన్ని కేంద్రాలలో, అసలు విద్యుత్ సౌకర్యంలేదు. విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించటంలేదు. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుండి బిల్లులు చెల్లించలేదు. దీని వలన అంగన్వాడీలు అప్పులు చేసి లబ్ధిదారులకు ఆహారం వండి పెడుతున్నారు. రకరకాల యాప్లు తీసుకొచ్చి పనిభారం పెంచారు. కానీ వేతనాలు పెంచలేదు. అంగన్ వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదు. గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదు. ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెనూ ఛార్జీలు, సరుకుల క్వాంటిటీ పెంచలేదు.ఈ సమయాలన్నింటిపై కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేపట్టారు.



ప్రశంసా పత్రం అందజేస్తున్న అతిథులు

యునాని వైద్యం ప్రాచీనమైనది

-కెవిఆర్ లో జాతీయ యునాని దినోత్సవ వేడుకలు
-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రామ గిడ్డయ్య

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

యునాని వైద్యం ప్రాచీనమైనదని ఈ వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని కెవిఆర్ మహిళా కళాశాల ఆడిటోరియంలో డాక్టర్ హకీమ్ అజ్మల్‌ఖాన్ 155 వ జయంతి సందర్భంగా జాతీయ యునాని దినోత్సవాన్ని ఎపి యునాని డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డి డిఎహెచ్ఒ డాక్టర్ బి.రామగిడ్డయ్య , ట్రైబల్ వెల్ఫేర్ శాఖ జాయింట్ డైరెక్టర్ సరస్వతి, కెవిఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి, ఎపి యునాని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ షాకీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యునాని వైద్యం ప్రతి ఒక్క పేషెంట్‌కు అందించేందుకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్ విభాగం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం కెవిఅర్ కళాశాలలో ఉచిత యునాని వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యునాని మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, వైద్యులు, విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని కర్నూలు 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సిఐటియు, కెవిపిఎస్, ఆవాజ్ డివైఎఫ్ఐ కమిటీల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అఖండ విజయం చేకూర్చాలని పట్టభద్రులను కోరారు. శ్రీరామ నగర్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ల నుండి విశేష స్పందన లభించింది. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్.అజ్మత్, కెవిపిఎస్ వార్డునాయకులు జి.ఆంజనేయులు, పి.నాగరాజు, బి. జయపాల్, డివైఎఫ్ఐ నాయకులు ఆర్.శేషం రాజు, టి.శ్రీనివాసులు ఎన్నికల ప్రచార క్యాంపియెన్‌లో పాల్గొన్నారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్స్‌కు వివరిస్తూ డాక్టర్ పోతుల నాగరాజు విద్యార్థి దశ నుండే ప్రజా సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థి ఉద్యోగ సమస్యలపైన, సామాజిక ఉద్యమాల ఉద్యమాలు నడిపారని తెలిపారు. 2003 సంవత్సరంలో మండల కమిషన్ నివేదికను అమలు చేయాలని 500 మందితో ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రికి వినతి పత్రం ఇచ్చారన్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేశారన్నారు. సమైక్య ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఆయనకు నాలుగు రోజులపాటు జైల్లో పెట్టారు. 2017 సంవత్సరంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆర్‌పిఎస్ సంస్థను ఏర్పాటు చేశారని, ఆర్‌పిఎస్ ద్వారానిరుద్యోగ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం క్రియాశీలకంగా పోరాటం చేశారన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం 2018 సంవత్సరంలో దేశంలోనే మొట్ట మొదట రాజ్యాంగ పరిరక్షణ సభను దాదాపు పదివేల మంది ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సభకు 17 పార్టీల నేతలను, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారన్నారు. ఇలాంటి శక్తి సామర్థ్యాలు కలిగిన నాయకుడిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే చట్టసభల్లో ప్రజల వాణి వినిపిస్తారన్నారు. పోతుల నాగరాజుకు మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ధ్వజ స్తంభ ప్రతిష్టలో ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ట శనివారం సర్పంచి సునీత మధు రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కంగ్రాటి శ్రీదేవి హాజరయ్యారు. స్వామివారి కి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు స్వామివారికి ప్రత్యేక పూజ చేశారు. అదేవిధంగా ఇంటి ఆడపడుచులకు చీర, సారెలు పెట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ఉచిత అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. వెంకట్ రెడ్డి , భాస్కర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, రంగయ్య, భాస్కర్ నాయుడు , కె.వెంకట గిడ్డయ్య, పులయ్య, వినోద్ సూర్యనారాయణ లు పాల్గొన్నారు.



మెడికవర్ హాస్పిటల్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓ మహిళకు కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. మెడికవర్ వైద్యులు యూరాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ సమద్, అనస్థీషియా డాక్టర్ బాల ప్రవీణ్ , డాక్టర్ రేష్మ బృందం ఈ చికిత్సలో పాల్గొన్నారు. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ సమద్ తెలిపిన వివరాల ప్రకారం.... 32 సంవత్సరాల మతిస్థిమితం లేని మహిళ మెడికవర్ హాస్పిటల్ కర్నూలు ఎమర్జెన్సీ వార్డులో తీవ్రమైన కడుపు నొప్పితో చేరింది. ఆమెకు పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పనిచేయని స్థితిలో ఉండి కడుపులో చీము పేరుకుపోయింది. సిటీ స్కాన్ చేసిన తర్వాత మూత్రశయంలో పదునైన పెన్సిల్ చేరి మూత్రాశయానికి రంధ్రాలు పడి కడుపులో మూత్రం లీకు అవుతున్నదని నిర్ధారించారు. ఆమెకు వెంటనే అత్యవసర శస్త్ర చికిత్స చేసి పెన్సిల్ ని తొలగించి మూత్రాశంలో రంధ్రాలను సవరించి ప్రాణాలను కాపాడారు. ఇటువంటి సంఘటన చాలా అరుదని జీవితకాలంలో ఒకటి లేదా రెండు కేసులు మాత్రమే చూస్తామని తెలిపారు. మతిస్థిమితం లేని పేషంట్ల దరిదాపుల్లో పెన్నులు, పెన్సిళ్ళ, మేకులు, పిన్నులు లాంటి చిన్నచిన్న వస్తువులు లేకుండా కుటుంబ సభ్యులు చూసుకోవాలని డాక్టర్ ఎస్ అబ్దుల్ సమద్ తెలిపారు.



డాక్టర్ అబ్దుల్ సమద్



భౌతికకాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాదరెడ్డి, తెర్నేకల్ సురేందర్

వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్‌కు శనివారం మాతృ వియోగం కలిగింది. ఈ మేరకు ఆయన తల్లి పార్థివ దేహాన్ని కర్నూలులో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద రెడ్డి, నాయకులు తెర్నేకల్ సురేందర్ రెడ్డి , లక్ష్మికాంత రెడ్డి, మురళీ రెడ్డి పలువురు వైసిపి నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

కళ్యాణమస్తు,షాదీ తోఫాలకు టెన్త్‌పాస్ నిబంధన తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



రాష్ట్ర ప్రభుత్వం నాలేగేళ్ల తర్వాత కళ్యాణమస్తు, షాదితోఫాలకు పదో తరగతి పాస్ కావాలని పెట్టిన నిబంధనను తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కళ్యాణమస్తు, షాదీ తోఫాలను తిరిగి ప్రారంచడం మంచిదేనని, ఇది పట్టణ పేద ప్రజలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదని పేర్కొన్నారు. నిత్యం కరువుకాటకాలతో ఉంటున్న ఆంధ్ర రాష్ట్రంలో అత్యధిక మంది పేద ప్రజలు ఉంటున్న ఈ రాష్ట్రంలో తల్లిదండ్రులు తమ పిల్లలను 10వ తరగతి వరకు చదివించడమనేది మంచిదైనప్పటికీ అది ఆచరణలో చాలా కష్టంతో కూడుకున్నదని అన్నారు. అసంఘటితరంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేద రైతులు తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసలు వెళుతున్నది నిత్యం చూస్తున్నామని, ముందు ఉపాధి కల్పిస్తే పదో తరగతి వరకు చదివించాలనే నిబంధన పెట్టడం ఉపకరణంగా ఉంటుందని సూచించారు. మూడేళ్ల తర్వాత వచ్చిన ఈ పథకాన్ని చూస్తే సంతోషపడాలో బాధపడాలో తల్లిదండ్రులకు అర్థం కావడం లేదని అన్నారు. అందువల్ల పేద ప్రజలకు సహాయం అందించాలని ఆలోచన ఏమాత్రం ఉన్న పదవ తరగతి పాస్ కావాలని నిబంధనను ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.



బ్రాహ్మణదొడ్డిలో పాచి పట్టిన నీటి ట్యాంకు

చుట్టూ అపరిశుభ్రత - శుద్ధినీటికి నోచని ట్యాంకు

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డిలో తాగునీటి ట్యాంకు పాచితో నిండుకొని చుట్టూ అపరిశుభ్రతను సంతరించుకొంది. అక్కడి మహిళలు అక్కడే బట్టలు ఉతకడం, పశువులను కడగడం కూడా చేస్తున్నారు. నెలలుగా ట్యాంకు శుభ్రం చేయక శుద్ధిని చేయక అవే నీటినే ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికే మండలంలో సురక్షితమైన నీరు అందక ఈర్లదిన్నెలో, పోలకల్‌లో,ప్రజలు అశ్వస్థతకు గురై, డెంగీ బారిన బడి అస్పత్రిలో చేరిన సంఘటనలు చోటుచేసుకొన్నాయి. ఇక్కడే బ్రాహ్మణదొడ్డిలో ఈ ట్యాంకు దృశ్యాలు చుస్తే కనీసం చర్యలు చేపట్టక పోవడం శోచనీయం.

విలేకరులను క్షమాపణ కోరిన సిబెళగల్ ఎంపిపి

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ ఎంపిపి బొంతల మునెప్ప ఈ సోమవారం తమ ఎమ్మెల్యే సుధాకర్ పై ఓ పత్రిక వ్యతిరేకలో వార్తలు రాసారని విలేకరులపై విరుచుక పడ్డారు. అంతటితో ఆగకుండా రాయలేని పరుష దూషణలతో చిందులు వేస్తుండగా ప్రక్కనే ఉన్న ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. విలేకరిని హేళన చేయడం నెట్టింటా వైరల్ అయ్యింది. ఇక్కడే తాలూకా, జిల్లా ఎపియుడబ్ల్యుజె సంఘ నాయకులు ఎంపిపిని నిలదీశారు. ఎట్టకేలకు శనివారం సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఎంపిపి స్పందించి క్షమాపణ కోరారు.



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న విట్టా రమేష్

కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన విట్ట రమేష్

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దేవాన్ష్ చౌహాన్‌కు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్ట రమేష్ హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో శనివారం ఘన స్వాగతం పలికారు. శాసన మండలి ఎలక్షన్స్ షెడ్యూల్ జారీ అయినా నేపథ్యంలో మంత్రి రాయలసీమ జిల్లాల పర్యటనకు ఢిల్లీ నుండి బయలుదేరి శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ ఎయిర్పోర్ట్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో పార్టీ ప్రోటో కాల్ ప్రకారం మంత్రి దేవాన్ష్ చౌహన్‌కు బిజెపి విట్టరమేష్ పుష్ప గుచ్ఛంతో స్వాగతించారు. ఆదివారం ఉదయం కర్నూలు మౌర్య ఇన్‌లోని పరిణయ ఫంక్షన్ హల్‌లో జరిగే ఇంటలెక్చువల్ మీటింగ్ కు ముఖ్య అతిధిగా హాజరై మంత్రి మాట్లాడ నున్నారు. అలాగే సాయంత్రం ఆదోనిలోని వాసవి మాత ఆలయంలో నిర్వహించే సమావేశంలో పాల్గొనబోతున్నట్లు విట్ట రమేష్ తెలిపారు. ప్రధానంగా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా రాయలసీమ జిల్లాలోని గ్రాడ్యుయేట్స్, ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఎన్‌జిఒస్, న్యాయవాదులు, తదితర పట్టభద్రుల ఓటర్లతో సమావేశం కానున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా పండిట్ దీన్ దయాల్ వర్ధంతి

బిజెపి వ్యవస్థాపకులు ప్రదాత పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని బిజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జ్యైన్, పట్టణ అధ్యక్షుడు మహదేవ్ మాట్లాడారు. దీన్ దయాల్ ఏకాత్మ మానవవాద సిద్ధాంతకర్త, అంత్యోదయ సూక్తి ప్రదాత, గొప్ప మానవతావాది అని కొనియాడారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మలేకర్ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు తోచిన విధంగా కానుకలను సమర్పించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోటో:నివాళి అర్పించిన ప్రకాష్ జైన్

జిల్లా కబడ్డీ జట్టు శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

అండర్ 14 బాలుర విభాగంలో కర్నూలు జిల్లా కబడ్డీ జట్టుకు ఐదు రోజులపాటు జరిగే శిక్షణ శిబిరాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన నేషనల్ విద్యా సంస్థల అధినేత జి గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ శనివారం నేషనల్ స్కూలు మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడాకారులు శిక్షణలో మెళకువలు నేర్చుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు తమవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. అనంతరం జీ గోపాల్ రెడ్డి, విజయ్ కుమార్‌లను ఎపీ వ్యాయామ ఉపాధ్యాయుల ఆదోని జోన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, నరసింహరాజు, ట్రెజరర్ ఆనంద్ శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ నరసయ్య, కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి ఖలీల్ అహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, బాలు, కబడ్డీ శిక్షకులు రవి, గోవిందు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో గోపాల్ రెడ్డి

ప్రశ్నించే వారినే ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలి

పిడిఎఫ్, ప్రజా సంఘాలు బలపరుస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలపై చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ కోరారు. శనివారం ఆదోని పట్టణంలో పిడిఎఫ్ బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, నర్సులకు కరపత్రాలు ఇస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రతి ఏడాది ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగులను నమ్మించి అధికారం రాగానే సీఎం జగన్ మోసం చేశారన్నారు. సమస్యలు పరిష్కారం హక్కుల కోసం ఉద్యోగులు ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంద న్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలను చట్టసభల్లో నిలదీ యాలంటే పిడిఎఫ్ బలపరుస్తున్న వారిని ఎమ్మెల్సీలుగా పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న,తిప్పాన్న, ఏఐటీయూసీ నాయకులు సుదర్శన్, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు షాబీర్ బాషా, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

ఆస్పరి : పట్టబద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు హనుమంతు, బాలక్రిష్ణ, రంగస్వామిలు కోరారు. శనివారం మండల కేంద్రమైన ఆస్పరిలో పట్ట బద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పెద్దల సభలో గళం వినిపించే నాయకు లను ఎన్నుకో వాలన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగుల ఔట్ సోర్సిం గ్, కాంట్రాక్ట్ సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాడే అభ్యర్థులను ఎన్నుకో వాలని అన్నారు. కార్యక్రమంలో రాము, రవి,రంగన్న,వీరభద్ర పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న రాధాకృష్ణ, నేతలు



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బండలాగుడు పోటీల్లో విజేతగా యస్ కొత్తూర్ వృషభాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో హజరత్ దివానే మస్తాన్ వలి ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం నిర్వహించిన అంత రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలలో విజేతగా నంద్యాల జిల్లా ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డికి చెందిన వృషభాలు 3600 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. రాతిదూల లాగుడు పోటీలు మండల జడ్పిటిసి కిట్టు, ఎంపీపీ భర్త లుముంబా, నిర్వాహకులు తిక్కయ్య, మస్తాన్, బాబులు ప్రారంభించారు. పోటా పోటీగా జరిగిన ఈ రాతి దూల లాగుడు పోటీల్లో రెండో విజేతగా వైయస్సార్ జిల్లా పెద్దముడియం, నంద్యాల జిల్లా తుమ్మలూరు గ్రామానికి చెందిన సుదీత్ కుమార్ రెడ్డి, పల్లవి వృషభాలు 3449 అడుగులు లాగి నిలిచాయి మూడవ విజేతగా నంద్యాల జిల్లా క్రాంతి నగర్, కర్నూలు జిల్లా కృష్ణాపురం గ్రామానికి చెందిన ఆర్కే రెడ్డి, శివ రాముడు వృషబాలు 33 71 అడుగులు లాగి నిలిచాయి. నాలుగో విజేతగా నంద్యాల జిల్లా ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన బిరం బుల్స్ 3335 అడుగులు లాగి నిలిచాయి. ఐదో విజేతగా కర్నూలు జిల్లా పెద్దనేలటూరు గ్రామానికి చెందిన సుంకన్న వృషభలు 3122 అడుగులు లాగి నిలిచాయి. 1,2,34,5వ విజేతలకు బహుమతుల దాతలు ఖాదర్ బాషా రూ 50 వేలు, 40,000 సర్పంచ్ షేకమ్మ, తిక్కయ్య, పెద్ద మస్తాన్, బోయ హనుమంతు రూ 30000, బేల్దారి మస్తాన్ 20000, మాదన్న రూ.10 000 అందించారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోటీలను తిలకించడానికి వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు : యుటిఎఫ్

- మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నందవరం

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని జిల్లా అధ్యక్షుడు జె.ఎల్లప్ప ఆరోపించారు. స్థానిక ఎంఆర్‌సి లో నందవరం మండల శాఖ నూతన కమిటీని ఎన్నికల అధికారి బి.నవీన్ పాటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జె.ఎల్లప్ప మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీని చెల్లించాల్సిన జీతాలు పదో తేదీ వచ్చిన చెల్లించకపోవడం ప్రతినెల ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాల కోసం ఎదురు చూడాల్సి రావడం సరికాదని పేర్కొన్నారు. గడిచిన నాలుగైదు నెలలుగా ఒకటో తేదీన జీతం పడటం లేదని, జీతం ఎప్పుడు వస్తుందో చెప్పేవారు లేకపోవడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు అందోళన లో ఉన్నారని అన్నారు. జీతం మీద ఆధారపడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఇబ్బందులకు ప్రభుత్వం గురి చేస్తుందని పేర్కొన్నారు. సకాలంలో బ్యాంకులోన్లు చెల్లించకపోవడం వల్ల డిఫాల్టర్స్‌గా మారాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. గత నాలుగైదునెలుగా పెనాల్టీలు కడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జనవరి నెల జీతం చెల్లించాలని లేనిపక్షంలో జీతాలకోరకు ఉద్యమబాట తప్పదని హెచ్చరించారు.

యుటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నందవరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులు యం.సుధాకర్, గౌరవాధ్యక్షులు ఎస్.ఆంజనేయులు అధ్యక్షులు ఆర్. వెంకట్రామూడు, సహాధ్యక్షులు పి. హనుమంతు, పద్మా, ప్రధాన కార్యదర్శి యన్. నాగరాజు, ఆర్థిక కార్యదర్శి ఈ. దానమయ్య, మండల కార్యదర్శులు రంగన్న, బాలరాజు, ఇసాక్, సురేంద్రబాబు, యం.లింగమూర్తి, వై, కృష్ణ, మనోరంజనీ, బెల్షజర్, పి.మద్దయ్య, రవీంద్ర లాల్, మహేశ, ఇంద్రమ్మ, రామకృష్ణ, బి.నాగరాజు, యం.ఇ.హిన్నత్ నాయుడు, మండల ఆడిట్ కమిటీ కన్వీనర్ యంటి రామకృష్ణ, మహిళా విభాగం కన్వీనర్ కె. శైలాజ రాణి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యుటిఎఫ్ నేతలు

వైసిపి ప్రభుత్వాని ఇంటికి సాగనంపాలి : కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రాని నాశనం చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని తుంబలబీడు,హతిబెలగల్ గ్రామంలో రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నవ రత్నాల పేరిట పేద ప్రజలను నమ్మించి నిత్యావసర సరుకులు, గ్యాస్,పెట్రోల్ ధరలను అమాంతంగా పెంచారన్నారు. ప్రతి మనిషి పై రెండు లక్షలకు పైగా అప్పు చేస్తున్నారన్నారు. ఇలాగే ఉంటే రాబోయే కాలంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్ యాదవ్,నాయకులు ఈరన్న,వెంకటేష్ ,రాజు, కొమ్ము రామంజి,చంద్రశేఖర్,గూళ్యం రామాంజనేయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండల పరిధిలోని గ్రామాలలో నారాయణపురం గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో గీతావాణి ఆదేశాల మేరకు మురుగు నీటి కాలువలను ప్రధాన వీధులను పారిశుధ్య కార్మికులు శుభ్ర పరుస్తున్నారు. కాలువలు శుభ్రపరిచిన అనంతరం కాలువలలో, నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి దోమలు వ్యాప్తి చెందకుండా అరికడుతున్నారు. అనంతరం ప్రధాన వీధులలో హైపో ద్రావణాన్ని పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ గ్రామాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం అందజేసిన తడి, పొడి చెత్తలకు డస్ట్ బిన్‌లను వాడి పర్యా వరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలియజేశారు. అల్లమ్మ గారి పురుషోత్తం రెడ్డి దగ్గరుండి పారిశుధ్య కార్మికులు చేత గ్రామ వీధులలో గల కాలువ పూడికను,గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు.



పారిశుద్ధ పనులు చేపిస్తున్న దృశ్యం



నాగన్న ను సన్మానించిన ఉద్యోగులు

నాడు రాజీనామాకు సిద్ధమై..

నేడు ఉత్తమ ఉద్యోగిగా సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

నాడు విధులు నిర్వర్తించలేక రాజీనామాకు సిద్ధమైన ఎనర్జి అసిస్టెంట్ కె నాగన్న.. నేడు ఉత్తమ అవార్డు పొంది సన్మానించబడటం ఆదర్శనీయమని యుఈఈయు (సీఐటీయు) డివిజన్ గౌరవాధ్యక్షులు, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు పి ఈరన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి హెచ్ రంగప్ప అన్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాజీనామాకు సిద్ధమైన నాగన్నను తోటి ఉద్యోగస్తులు, ఉన్నతాధికారులు సముదాయించడంతో రాజీనామాను ఉపసంహరించుకొని కలెక్టర్‌చే ఉత్తమ ఆవార్డును ఆందుకోవడం సూర్తిదాయకమన్నారు. నేడు ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు నాగన్న వల్ల మంచి పేరు వచ్చిందని ఉన్నతాధికారులచే ప్రశంసలందుకుం టున్నారని తెలిపారు.ఏనుగుబాల సచివాలయం జిల్లా స్థాయిలో నిలిచిందంటే ఆ ఘనత నాగన్నకే దక్కుందన్నారు. కష్టపడి పనిచేస్తే ఎక్కడ్కైన ప్రశంసలందుకుంటారని నాగన్న నిరూపించారన్నారు. అనంతరం నాగన్నను శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు యు ఆంజనేయులు, డివిజన్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కె భీమేష్, ఎస్‌పిడీసిఎల్ కమిటీ ఉపాధ్యక్షులు పి నాగరాజు, ఆదోని డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మల్లికార్జున పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - ఆదోని

రోజూ ఒక గంట సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే మానిసిక ఆరోగ్యంతోపాటు శారీరక దఢత్వం కలుగుతాయని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీడీ డాక్టర్ హెచ్‌ఎంవై స్వామి, అక్షరశ్రీ హైస్కూలు ప్రిన్సిపాల్ రఘు ప్రసాద్ అన్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదోని జోన్ అంతర్ పాఠశాలల బాస్కెట్ బాల్ పోటీలను వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడల్లో పాల్గనడం ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించడానికి అవసరమైన క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత, గెలుపు ఓటములను సమానంగా తీసుకునే సామర్థ్యం లాంటి మంచి లక్షణాలు అలవాడతాయన్నారు. అనంతరం ఆదోనిలోని మహబూబియా ఫంక్షన్ హాల్ యజమాని మహమ్మద్ అలీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు స్పాన్సర్ చేశారు. టోర్నమెంట్ ఆర్గన్యైజర్లు షాషావలి, మస్తాన్ క్రీడా దుస్తులు స్పాన్సర్ చేసిన మహమ్మద్ అలీకి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపీ పీఈటీ ఆదోని జోన్ అసోసియేసన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, నరసింహ రాజు, కోశాధికారి ఆనంద్, వ్యాయామ ఉపాధ్యాయులు ముజాహిద్, రామన్న, కవి రాజు, శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభించిన ఫిజికల్ డైరెక్టర్

గడ్డివాములకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కౌతాళం

మండల పరిధిలోని హాల్వి గ్రామంలో భారీ అగ్ని ప్రమాదం తప్పడంతో శనివారం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలోని చెరువు గడ్డపై రైతులు గడ్డివాములు వేసుకున్నారు. గడ్డివాములకు కొద్ది దూరంలో అగ్ని మంటలు వ్యాపించాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి (కోసిగి పోలీస్ స్టేషన్) గ్రామస్తుల సహకారంతో అగ్ని మంటలను అదుపులో తీసుకురావడం జరిగింది. చెరువులో నీరు ఉండడంతో గ్రామ ప్రజలు బిందెలతో, స్ప్రేర్ పంపులతో అగ్నిమంటలను ఆర్పడం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున అప్రమత్తం కావడంతో 80 గడ్డివాములు అగ్ని ప్రమాదానికి గురి కాకుండా కాపాడడం జరిగింది. దీంతో పెను ప్రమాదం తప్పడంతో పాడి రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



అగ్ని మంటలను ఆర్పుతున్న కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి



అశేష జనవాహిన మధ్య రథం లాగుతున్న భక్తులు

రమణీయం రేణుక ఎల్లమాంబ రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగి రేణుక ఎల్లమాంబ రథోత్సవం శనివారం అశేష జనవాహిని మధ్య రమణీయంగా కన్నుల పండుగగా సాగింది. సాంప్రదాయబద్ధంగా కోసిగి దొరల వంశస్తులైన మురళి దొర, శ్రీనివాసు దొర ఇంటి నుంచి సర్కార్ పూర్ణకుంభం మేళ తాళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తూ అమ్మవారి గుడి దగ్గరికి ప్రత్యేక పూజల చేశారు. అనంతరం రథోత్సవం లాగారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని రేణుక ఎల్లమాంబకు ఆలయ అర్చకులు అయ్యన్న, విజయ్, మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లమాంబకు తెల్లవారు జాము నుంచి కుంకుమార్చన, ఫల పుష్ప అలంకరణ మాహా మంగళహారతులు వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మను దర్శించుకోవ డానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. కుడుము గుగ్గిళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో గత మూడు రోజుల నుండి గ్రామ సర్పంచ్ కుమారి, అయ్యమ్మ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. సాయంత్రం వేలాదిమంది భక్తుల నడుమ ఉదో ఉదో తాయి ఎల్లమ్మ అంటూ నామస్మరణంతో ఆలయం నుండి పాదాల వరకు రథోత్సవం లాగి తిరిగి యధాస్థితికి చేర్చారు. వైసిపి, టిడిపి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోసిగి సీఐ ఏరిష వలి, ఎస్ఐ రాజారెడ్డిల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

హమారా ప్రసాద్‌ను శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - నందవరం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని, అతడిని కఠినంగా శిక్షించాలని నందవరం మండల కెవిపిఎస్ అధ్యక్షులు ఎస్. రాజు డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో హైలెట్ కావడానికి అంబేద్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారా ? లేక వెనుక ఎవ్వరి హస్తం అయినా ఉందా ? అనే కోణంలో పోలీసులు విచారణ చేయాలన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గణతంత్ర దేశం మీద అదేశానికి మూలస్తంభం అయిన రాజ్యాంగం మీద రాజ్యాంగ నిర్మాత మీద దాడి చేసి దేశాన్ని విచ్ఛిన్నం చెయ్యటానికి కుట్ర పన్నారని అనిపిస్తుందని, అలాంటి వారి ఆగడాలు కూడా సహించేది లేదని హెచ్చరించారు. హమారా ప్రసాద్ వెనుక భారతదేశ మతోన్మాదుల హస్తం ఉందనే కోణంలో విచారణ చేసి కఠినంగా శిక్షించాలని, లేదా దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ఎస్. రాజు

భూ కబ్జాల్లో వైసిపి నేతలు : జనసేన

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వ భూములను వైసిపి నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారని జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ తెర్నెకల్ వెంకప్ప ఆరోపించారు. శనివారం ఆలూరులోని నర్సరీ వెనుకల ఉన్న చెరువును స్థానిక వైసిపి నాయకులు కబ్జాకు పాల్పడుతున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకప్ప విలేకరులతో మాట్లాడుతూ చెరువులో 5 ఎకరాల స్థలాన్ని చదును చేసుకొని ఆక్రమణకు గురౌతున్న ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఆలూరులోని ఎక్కడెక్కడ ప్రభుత్వ భుములు కబ్జాకు గురౌతున్నాయో వాటిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అవసరం మైతే కోర్టుకెళ్లాడనికైనా వెనుకాడబోమని తెలిపారు. ఆలూరు మండల కేంద్రంలో సంతమార్కెట్, ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న కాంప్లెక్స్ లు సంవత్సరాలు గడిచిన కమీషన్లకు, స్వార్థప్రయో జనుల కొరకు వేలాలు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరన్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వేలాలు వేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించా లన్నారు. అంతకుముందు హతిబెలగల్ గ్రామంలో ఆత్మ హత్యకు పాల్పడిన ఈరన్న కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జన సైనికులు రంజిత్, ఛత్రపతి, యశోద్, అరవింద్, వెంకటేష్, బడేసాహెబ్ పాల్గొన్నారు. **దేవనకొండ** : గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జి తెర్నేకల్లు వెంకప్ప విమర్శించారు. శనివారం మండల కేంద్రమైన దేవనకొండలోని బీసీ, చాకలి కాలనీలో పర్యటించారు. సిసి రోడ్లు కాలువలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేసి ఉన్నాయని సీసీ రోడ్లు డ్రైనేజీ కాల్వలు కూడా లేకపోవడం దారుణమన్నారు. మంత్రి గుమ్మనూరు జయరాంకి ప్రజల సమస్యలు పట్టవా? కర్ణాటక మద్యంపై ఉన్న శ్రద్ధ ప్రజలు సమస్యలపై లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బడే సాహెబ్, జగదీష్, చంటి, నాగరాజు, రఫీ, దయ, తేజ పాల్గొన్నారు.



ఆలూరు : కబ్జాకు గురైన స్థలాని పరిశీలిస్తున్న జనసేన వెంకప్ప

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు అర్ధ రహితం

మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న హమారా ప్రసాద్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు సి రంగయ్య అన్నారు. శనివారం అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలియజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ ఒక హౌలా ప్రసాద్ అని అన్నారు. సైబర్ ఉగ్రవాది హమార ప్రసాద్‌ని అరెస్ట్ చేయించిన ప్రముఖ సుప్రీం కోర్టు న్యాయ వాది కార్తీక్ నవయన్ బట్టులాకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని డివిజన్ సెక్రటరీ బన్నూరు నర్సింహులు, తాలూకా సెక్రటరీ మల్లేష్, కడిమెట్ల అధ్యక్షులు గోవిందు, బుదురూ నాయకులు నర్సింహులు, అంజినయ్యా, వీరేష్, బలరాం, రాముడు, మాధవరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య



'తెల్ల బంగారం' తెల్లబోయింది..

- పత్తికి ధర లేక ఇండ్లలోనే నిల్వ
- ధర, దిగుబడి లేక తీవ్ర నష్టం
- గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి - బనగానపల్లె

తెల్ల బంగారం ధరలు తెల్లబోయాయి.. పత్తి రైతులకు కష్టాలు తప్పడం లేదు. మద్దతు ధర లేక దళారులు నిర్ణయించిన ధరకే పత్తిని రైతులు అమ్ముకుంటున్నారు. ఆరుగాలం కష్టపడి పని చేసిన పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేక దళారులు చెప్పిన రేటుకే పత్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులకు నెలకొంది. కొందరు రైతులు గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తిని ఇండ్లలోనే నిల్వ ఉంచుకుంటున్నారు.

బనగానపల్లె మండలంలో 2 వేల ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేశారు. ఎకరానికి 40 నుండి 50 వేలు పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేశారు. దిగుబడి లేక, ధర లేక పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం పత్తి కిలో 120 రూపాయలు ధర పలకడం, దిగుబడి ఆశాజనకంగా రావడంతో రైతులు తాము తీర్చిన అప్పులను ఈ సంవత్సరమైనా చెల్లించవచ్చని పత్తి పంటను అధికంగా సాగు చేశారు. పత్తి పంటకు తెగుళ్ల సోకి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. రైతుల చేతికి పత్తి పంట వచ్చే సమయానికి దళారులు, వ్యాపారులు పత్తిని కొనుగోలు చేయడం నిలిపివేశారు. పత్తికి డిమాండ్ లేదని రోజురోజుకు ధర తగ్గిస్తూ వచ్చారు. మొదట్లో కేజీ 120 రూపాయలు పత్తి ధర రూ.100లకు తగ్గించారు. తరువాత రూ.90, 80, 70, 60 రూపాయల వరకు తగ్గించారు. ప్రారంభంలో ఉన్న ధర కంటే మరింత ధర పెరిగే అవకాశం ఉందని ఆశతో కొంతమంది రైతులు



ఇండ్లలోనే నిల్వ ఉన్న పత్తి

పత్తిని అమ్మలేదు. ధరలు పడిపోయే అవకాశం ఉందన్న విషయాన్ని గ్రహించిన రైతులు పత్తిని అమ్మేందుకు సిద్ధంకాగా దళారులు కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో పత్తి ప్రస్తుతం మార్కెట్లో 60 నుండి 65 ధర పలుకుతుండడంతో రైతుల బాధలు వర్ణనాతీతం. అరకొర వచ్చిన దిగుబడికి కూడా ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దళారులు, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో మధ్యన రైతులు చితికి పోతున్నారు. ధరలు పడిపోవడంతో రైతులు ఇండ్లలోనే పత్తిని నిలువ ఉంచుకున్నారు. ధర పెరిగినప్పుడు అమ్ముకుందామని నిర్ణయించుకున్నారు. ఎకరానికి మూడు, నాలుగు క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చిందని, పెట్టిన పెట్టుబడి రావాలంటే కేజీ 110 రూపాయలకు అమ్మితేనే గిట్టుబాటు అవుతుందని రైతులు తెలిపారు. అధిక వర్షాలతో ఆశించిన పంట దిగుబడి రాలేదని, రోజు రోజుకు ధరలు తగ్గడంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని

రూ. 11 వేలకు పైగా ధర చెల్లిస్తేనే గిట్టుబాటు



ఈ సంవత్సరం అధిక వర్షాలతో పత్తి పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. పత్తి క్వింటాకు రూ.11,000 ధర చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుంది. ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి అయింది. దిగుబడి చూస్తే తగ్గిపోయింది. సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. చేసిన అప్పులు తీర్చడానికి మరోచోట అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మార్కెట్ యార్డ్ల ద్వారా క్వింటా 11 వేలకు పైగా కొనుగోలు చేయాలి.

- గజ్జల ఈశ్వరయ్య, రైతు పాతపాడు గ్రామం.

ఆశించిన దిగుబడి రాలేదు



రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడి రాలేదు. పత్తి సాగు చేసే సమయంలో ధర అధికంగా ఉండడంతో ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టి పత్తిని సాగు చేస్తే ఎకరానికి రెండు, మూడు క్వింటాలు దిగుబడి మాత్రమే వచ్చింది. రూ. 50 వేలు పెట్టుబడి పెడితే రూ. 20 వేలు మాత్రమే వస్తుంది. ప్రభుత్వం పత్తిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- బాల తిమ్మయ్య, రైతు జోలాపురం గ్రామం.

'భద్ర'త కోసం ఉద్యమం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు ప్రధాన నీటి వనరు. అలాంటి డ్యామ్ నుండి మూడు జిల్లాలకు నీరు కరువయ్యే పరిస్థితి ఏర్పడనుంది. అందుకు ప్రధాన కారణం భద్ర ఎగువ వైపున కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.5300 కోట్లు కేటాయించడమే. తుంగభద్ర డ్యామ్ పైన తుంగ, భద్ర నదులు రెండూ కలసి తుంగభద్రగా హోస్పేట్ వద్ద ఏర్పడుతాయి. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాలకు నీటిని అందించే బహుళార్ధక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో 130 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. అయితే పూడిక కారణంగా ప్రస్తుతం దీని నీటి నిలువ సామర్థ్యం 100 టిఎంసిలకు పరిమితమైంది. ఈ ప్రాజెక్టు నుంచి కర్నూలు జిల్లాకు నీటిని అందించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్సి)కి 24 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్లో నీటి నిలువ సామర్థ్యం తగ్గడంతో ఇప్పుడు ఏటా సగటున దామాషా పద్ధతిలో కేటాయిస్తున్న నీరు 18 టిఎంసిల నుంచి 20 టిఎంసిల వరకే ఉంటోంది. వాస్తవానికి కర్ణాటక ప్రభుత్వం కడుతున్న అప్పర్ భద్రకు ఎలాంటి అనుమతులు లేవు. సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. అలాంటి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి భారీ ఎత్తున నిధులు కేటాయించడం బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేస్తున్న ఎన్నికల స్టంట్గా రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే తుంగభద్ర నుండి నీరు తక్కువగా వస్తున్నాయి. భవిష్యత్తులో అప్పర్ భద్ర ప్రాజెక్ట్ పూర్తి అయితే దిగువకు నీరు రావడం కష్టతరంగా మారుతుంది. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారనుంది. దీనిపై వామపక్ష, ఇతర రైతు సంఘాలు ఆందోళన బాట పట్టనున్నాయి. దీనిపై ఇప్పటికే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కర్నూలు కలెక్టరేట్ దగ్గర ఈ నెల 13న నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. రాయలసీమకు సాగు, తాగు నీరు అందాలంటే అప్పర్ భద్రను అడ్డుకునేందుకు సీమలోని పిల్లాజల్లా, కార్మికులు, కర్షకులు అందరూ కదలాలి. మన నీటి వాటా హక్కును కాపాడుకోవాలి.

సిపిఎస్ రద్దు కోసం పోరాటం

సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు చేసిన పాదయాత్రలో ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఆ హామీ నెరవేరలేదు. దాంతో యుటిఎఫ్ మళ్లీ పోరాటానికి శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలో దీక్ష చేపట్టారు.

అంగన్వాడీల ఆగ్రహం

ప్రభుత్వం తీరుపై అంగన్వాడీ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకి అంగన్వాడీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారు. అయినా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవు. కొన్ని కేంద్రాలలో, అసలు విద్యుత్ సౌకర్యం లేదు. విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుండి బిల్లులు చెల్లించలేదు. దీని వలన అంగన్వాడీలు అప్పులు చేసి లబ్ధిదారులకు ఆహారం వండి పెడుతున్నారు. రకరకాల యాప్లు తీసుకొచ్చి పని భారం పెంచారు. కానీ వేతనాలు పెంచలేదు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పని చెయ్యడం లేదు. గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదు. ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెనూ ఛార్జీలు, సరుకుల క్వాంటిటీ పెంచలేదు. ఈ సమయాలన్నింటిపై కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేపట్టారు.



శ్రీశైలంలో మహాశివరాత్రి

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మో త్సవాల ప్రారంభ పూజలో పాల్గొన్న దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ దంపతులు, దేవస్థానం ఇఒ దంపతులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మో త్సవాలు శనివారం సాంప్రదాయపద్ధంగా ప్రారంభ మయ్యాయి. ఆగమ శాస్త్రం ప్రకారం యాగశాల ప్రవేశం చేశారు. మహాశివరాత్రి ప్రారంభోత్సవ పూజలలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి దంపతులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం ప్రధాన అర్చకులు, వేదపండితులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాగశాల ప్రవేశం అనంతరం వేద స్వస్తి పలికారు. అనంతరం చండీశ్వర పూజ నిర్వహించారు. కంకణ పూజ, కంకణ ధారణ, అఖండ స్థాపన, రుద్ర కలశ స్థాపన, ఆ తర్వాత సాయం కాలం అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు : దేవస్థానం భక్తులను అలరించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. నిత్య కళారాధన వేదికపై నంద్యాలకు చెందిన సాయి నాట్యమంజలి వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, భ్రామరి కళావేదికపై భరతనాట్యం, భక్తి రంజని శివ దీక్ష శిబిరాలలో బ్రహ్మంగారి చరిత్ర, కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ప్రదర్శించారు.

శ్రీకాళహస్తీ దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం వారిచే స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలతో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి కె.వి సాగర్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు కలిసి ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ శ్రీశైలం దేవస్థానం అర్చకులు, వేద పండితులు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. దేవస్థానం ఇఒ తదితరులు కలిసి స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారికి, అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచనం మండపంలో వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు.

పరిహారం ప్రకటనలకే పరిమితం

- నాలుగు నెలలైనా ఊసే లేదు - మాండూస్, నకిలీ విత్తనాల పరిహారం కోసం రైతన్న ఎదురు చూపులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఏటా.. రైతన్నకు ఏదో ఒక దెబ్బ... అకాల వర్షాలు, విపత్కర పరిస్థితులు... నకిలీ విత్తనాలు.. బాగా పండినా గిట్టుబాటు రాకపోవడం.. గత ఏడాది అకాల వర్షాలు.. మాండూస్ తుఫాన్ వలన పంటలతో పాటు ఉద్యాన పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి.. రైతు పెట్టిన పెట్టుబడికి కనీసం మందు ఖర్చులు కూడా రావడం లేదు.. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నాడు.. రైతుకు చేయూతనిచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు.. పేపర్ ప్రకటనలకే పరిమితం అయ్యాయి. కేంద్రంలో పిఎం కిసాన్, రాష్ట్రంలో జగనన్న రైతు భరోసా పేరుతో తూతూ మంత్రంగా విదల్చడం తప్ప.. రైతు కన్నీరు తుడుచలేకపోతున్నారు..



నంద్యాల జిల్లాలో గత సంవత్సరం అకాల వర్షాలు, మండూస్ తుఫాన్ వలన రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు నెలలైనా ఇంతవరకు నష్టపరిహారం రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో తుఫాన్ వలన దాదాపు 10,869 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో 3 శాతం పైన నష్టపోయిన పంటలు 4250 హెక్టార్లు. అందుకు దాదాపు రూ.413 లక్షలు రైతులకు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించారు. అయితే పంట పొలాల్లో తిరిగి 33 శాతం దెబ్బతిన్న పంటలు మాత్రమే అంచనా వేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి 1568.02 హెక్టార్లలో పంట దెబ్బతిందని, 1966 మంది రైతులు నష్టపోయారని, రూ.162.53 లక్షలు నష్టం జరిగినట్లు అంచనా వేసి నివేదిక రూపంలో జిల్లా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. నాలుగు మాసాలైనా నేటి వరకు మాండూస్ నష్టపరిహారం రైతులకు అందలేదు. నష్టపరిహారం వస్తుందా రాదా అని, తమను ప్రభుత్వ ఆదుకుంటుందో లేదోనని రైతులు దిగాలు చెందుతున్నారు. ఉద్యాన శాఖకు సంబంధించి కూడా దాదాపు 11 లక్షల రూపాయలు వరకు వివిధ రకాల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.. వీటి నివేదికలు కూడా ప్రభుత్వానికి పంపినట్లు ఉద్యాన శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. మరోవైపు చాగలమర్రి, పాణ్యం, నంద్యాల, గోస్పాడు, గడివేముల, మిడుతూరు మండలాల్లో నకిలీ పత్తి విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దేశానికి వెన్నుముక రైతన్న అని చెప్పుకునే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు వైపరీత్యాల వలన దెబ్బతిన్న రైతులను ఆదుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు శూన్యంగా ఉంటున్నాయి.

మాండూస్ నష్టపరిహారం చెల్లించాలి



మాండూస్ తుఫాన్తో దెబ్బతిన్న పంటలకు త్వరగా నష్టపరిహారం చెల్లించాలి. నకిలీ విత్తనాల వలన పత్తి సాగు బాగా దెబ్బతింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్ నకిలీ విత్తనాల బెడద వలన రైతులు తీవ్రంగా నష్టపోయారు కాబట్టి ప్రతి రైతుకు మూడు క్వింటాళ్ల చొప్పున రూ.17 కోట్లు చెల్లించాలని రివార్డు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదు. కంపెనీలు కోర్టుకెళ్లిన వారి పిటిషన్లు కొట్టేసి రైతులకు అనుకూలంగానే తీర్పులు కూడా ఇచ్చాయి. కానీ నష్టపరిహారం చెల్లించడంలో కంపెనీలు శ్రద్ధ చూపడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు, ఎంపీలు జోక్యం చేసుకొని మాండూస్, నకిలీ విత్తనాల నష్టపరిహారం రైతులకు అందేలా కృషి చేయాలి.

- ఎ.రాజశేఖర్, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.



శివ భక్తులకు భిక్ష పెడుతున్న ముస్లిములు

శివ భక్తులకు మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో భిక్ష

- మత సామరస్యానికి చిహ్నం

ప్రజాశక్తి - పాములపాడు

వివిధ మతాలు కలిగిన భారత దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా ఒకరి మతాన్ని మరొకరు గౌరవించడం ఐక్యతను చాటుతుంది. మహాశివరాత్రి సందర్భంగా శనివారం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో పాములపాడు మండలంలో శివమాల వేసిన భక్తులకు బిక్ష పెట్టి మత సామరస్యాన్ని చాటారు. ప్రతి సంవత్సరం మండలంలో వేల సంఖ్యలో శివమాల వేస్తారు. పాములపాడు మండల పరిధిలో అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. మైనార్టీ సంఘం ఈ సంవత్సరం అన్నదానం చేయడం అన్ని మతాల ఐక్యతకు చిహ్నంగా నిలిచారు. అనంతరం సంఘం నాయకుడు మాట్లాడుతూ మనదేశంలో మతాలను గౌరవించడం సంప్రదాయంగా ఉందన్నారు. సోదర భావంతో కలిసి అన్ని మతాల వారి పండగలను గౌరవించుకొని దేశ ఐక్యతను చాటాలని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు చాంద్ భాషా, కాశీం సాహెబ్, నబిసా, అవాజ్ కమిటీ మండల అధ్యక్షులు మహబూబ్ బాషా, నాయకులు గఫూర్, రషీద్, సుభాన్, మర్తుజా, అన్వర్, అన్సర్, ఇస్మాయిల్, ఉస్మాన్ భాష, మహ మ్మద్ గని, మౌలాలి, నన్నేసా, శివాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో ఘంటసాల వర్ధంతి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని మినీ థియేటర్ సమీపంలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 48వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. లలిత కళా సమితి వ్యవస్థాపకులు బెజ్జం వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుల్లయ్య, కృష్ణయ్య, రామ సుబ్బయ్య తో పాటు సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించండి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నాయకులు రాజేష్, రత్నమయ్య, రాజు శనివారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసంఘాలు బలపరుస్తున్న అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నందల రూరల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని కోరుతూ నంద్యాల పట్టణంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ మాట్లాడుతూ మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికలలో నిరంతరం ప్రజా సమస్యలపై గళం విప్పే నాయకులను ఎన్నుకోవాలని కోరారు. పోతుల నాగరాజుకు, కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు మిద్దె వెంకట నాయుడు, విద్యార్థి సమాఖ్య నాయకులు రాజు, మహేష్, సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎన్నికల విధుల నుంచి

ఉపాధ్యాయుల తొలగింపు సమంజసం కాదు

- వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - మిడుతూరు

ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తొలగించి గ్రామ సచివాలయ సిబ్బందిని నియమించడం సమంజసం కాదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు పేర్కొన్నారు. శనివారం మిడుతూరులో సిఐటియు ఆధ్వర్యంలో ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1,90,000 మంది ఉపాధ్యాయులను ఎన్నికల విధులు నుంచి తొలగించి ఎన్నికల అవగాహన, అనుభవం లేని లక్షా 30 వేల మంది సచివాలయ సిబ్బందిని, వైసిపికి చెందిన గృహ సారథులకు, కన్వీనర్లకు ఎన్నికల సిబ్బందిగా నియమించడం విచారకరమన్నారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటికే అర్హత లేని వారిని ఓటర్లుగా చేర్పించిందని, ఇప్పటికే ఓటర్లను ఆకర్షించేందుకు కడపలో ఉద్యోగులకు క్యారియర్ బాక్సులు పంపిణీ సందర్భంగా పట్టుబడ్డారన్నారు. ఎన్నికల్లో గెలవడానికి అనేక అడ్డదారులకు వైసిపి ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు అన్ని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పని చేయాలని వారు కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు టి.ఓబులేసు, సిఐటియు నాయకులు శివుడు, నాగన్న, రైతు సంఘం నాయకులు శివరాముడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు


మద్దిలేటి స్వామి గుండంలో మృతదేహం

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామం పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని పెద్ద (గుండం) కోనేరులో మృతదేహం శనివారం తేలింది. గమనించిన భక్తులు స్వామివారి ఆలయ ఈవో పాండురంగారెడ్డికి విషయాన్ని తెలియజేశారు. వెంటనే మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు ఆర్ఎస్ రంగాపురం గ్రామం ఈడిగ సరస్వతి కుమారుడు ఈడిగ రామసుబ్బయ్య (27)గా గుర్తించారు. మృతుడు మద్దిలేటి స్వామి ఆలయం ప్రాంగణంలో కొబ్బరి టెంకాయల అంగడిలో పని చేస్తుండేవాడు. ఈ నెల 9వ తేదీ నుండి రామసుబ్బయ్య ఇంటికి రాలేదని, తెలిసిన వాళ్లను కలిసినా రాలేదని చెప్పారు. శనివారం పెద్ద కోనేరు గుండంలో రామసుబ్బయ్య శవమై కనిపించడంతో తల్లి సరస్వతి రోధించడం చూపరులను కలిచివేసింది. రామసుబ్బయ్య కాలుజారి గుండంలో పడిపోయాడని, ఈత రాక చనిపోయాడని ఆలయ సిబ్బంది అంటుంటే కుటుంబ సభ్యులు మాత్రం ఒంటిపైన దెబ్బలు, గాయాలు ఉన్నందున అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని బేతంచెర్ల పోలీస్ స్టేషన్ వారికి తెలియజేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



రామ సుబ్బయ్య మృతదేహం



శ్రీశైలంలో బాయిలర్ పేలి ఇద్దరికీ గాయాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానంలోని అన్నపూర్ణ భవనంలో శనివారం మధ్యాహ్న సమయంలో భోజనశాలలో బాయిలర్ పేలి ఇద్దరికీ స్వల్ప గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. ప్రతిరోజు అన్నం బాయిలర్లో ఉడికించి నీటిని వదిలిన అనంతరం బాయిలర్ నుండి అన్నం తీసి భక్తులకు వడ్డిస్తారు. అదే ప్రకారంగా శనివారం కూడా అందులో పని చేసే వర్కర్లు యధావిధిగా పనులు చేసుకుంటూ ఉన్నారు. అకస్మాత్తుగా ఎక్కువగా వేడి అయిన బాయిలర్ పేలిపోయింది. అక్కడే పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. బాయిలర్ పేలిన శబ్దం అధికంగా రావడంతో భక్తులు, అందులో పనిచేసే వర్కర్లు భయపడిపోయారు. అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన వారిని దేవస్థానం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. గతంలో కూడా ఇదే ఘటన చోటు చేసుకుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అధికారులు పరిశీలిస్తున్నారు.

మహానంది బ్రహ్మోత్సవాలకు జిల్లా ఎస్పికి ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహానందిలో ఈ నెల 16 నుండి 21 వరకు జరగనున్న కామేశ్వరీ సమేత మహానందిశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సినంగా జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డిని మహానంది దేవస్థానం ఇఒ కాపు.చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ కొమ్మ.మహేశ్వర్ రెడ్డిలు శనివారం ఆహ్వానించారు. నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పికి సాంప్రదాయబద్ధంగా వేదపండితుల ఆశీర్వచనలతో ఆహ్వానం అందజేశారు. అనంతరం స్వామి వారి ప్రసాదం అందజేశారు.



ఎస్పికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

భారీ వాహనాల దారి మళ్లింపు : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు, విఐపిలు భారీగా దైవదర్శనానికి తరలివస్తారని, దీనికి సంబంధించి ఈ నెల 17వ తేది నుండి 19 వరకు విజయవాడకు వెళ్లాల్సిన భారీ వాహనాల రాకపోకలకు దారి మళ్లించినట్లు ఎస్‌పి రఘువీర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలులోని నంద్యాల చెక్ పోస్ట్ నుండి ఆత్మకూరు-దోర్నాల మీదుగా విజయవాడకు రాకపోకలు నిలిపివేశామని, వాహనదారులు గమనించి లారీలు, భారీ గూడ్స్ వాహనాలు ఈ నెల 17 నుండి 19 వరకు కర్నూలు పట్టణంలో గల నంద్యాల చెక్ పోస్ట్ నుండి నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం మీదుగా విజయవాడకు చేరుకోవాలని సూచించారు.

శ్రీశైలం, బ్రహ్మగుండంకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-డోన్

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా డోన్ డిపో నుండి శ్రీశైలం, బ్రహ్మగుండం శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపబడునని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలానికి 20, బ్రహ్మగుండంకు 10 బస్సులు నడుపుతున్నామని, డోన్ నుండి శ్రీశైలంకు చార్జీ రూ.430, కర్నూలు నుండి శ్రీశైలం రూ.350, కర్నూల్ నుండి వెంకటాపురం రూ.150 చార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తులు రిజర్వేషన్ చేసుకునే సమయంలోనే స్వామి అమ్మవార్ల దర్శనం టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పోస్టల్ ఖాతాలు ప్రారంభించుకోండి

- జిల్లా వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పిఎం కిసాన్ లబ్ధిదారులై ఉండి బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాని రైతులు దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌లో ఖాతాలు ఓపెన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలకు మొబైల్ ఆధార్ నెంబర్లు లింకు కాకపోవడంతో జిల్లాలో 3500 బ్యాంకు ఖాతాలు ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయన్నారు. వీరంతా పోస్ట్ ఆఫీస్‌లో 50 రూపాయలు చెల్లించి ఐపిపిబి ఖాతాను ప్రారంభించుకోవాలని తెలిపారు.

సంజామల నుండి శ్రీశైలానికి కాలినడకన శివ స్వాములు

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండల కేంద్రం నుంచి శివ భక్తులు శ్రీశైలానికి శనివారం బయలుదేరారు. శివదీక్ష విరమణకు ఇరుముడి కట్టి శివ స్వాములు వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు.

వాసాపురం వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం సమీపంలో వెలసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నంద్యాల, గిద్దలూరు, ఆళ్లగడ్డ, గాజులపల్లి, రుద్రవరం చుట్టుపక్కల మండలాల నుంచి వందల వందలాది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అల్పాహార ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదనరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట రంగనాయకుల శెట్టి, కోశాధికారి, కానాల ఈడిగ నరసింహులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేశామని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు పి.వాసు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో సీనియర్ మరియు జూనియర్ సివిల్ జడ్జిల సహకారంతో మూడు బెంచ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జి బి. రాధా రాణి, జూనియర్ సివిల్ జడ్జి ఎం.శైలజ బెంచులను నిర్వహించారని, మొత్తం 242 సివిల్ , క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి శైలజ 102 కేసులను, సీనియర్ సివిల్ జడ్జి రాధరాణి 28 కేసులను, సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి 108 కేసులను, జిల్లా జడ్జి 4 మోటర్ వెహికల్ కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని తెలిపారు. ఇందుకు సహకరించిన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, పోలీసు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కక్ష దారులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీధర్ గౌడ్, న్యాయవాదులు రమణయ్య, రమణారావు, సుబ్బశర్మ, వెంకటయ్య, సరిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరు పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో జరిగిన జాతీయలోక్ అదాలత్‌లో మొత్తం 85 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. ఇందులో 24 క్రిమినల్, 4 సివిల్, 53 సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు క్రిమినల్ కేసులు, 4 యూనియన్ బ్యాంకు కేసులు పరిష్కారం అయ్యాయి. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు. జూనియర్ సివిల్ జడ్జి రఘునాథ్ విచారించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన మెగా లోకాదాలత్ లో 216 కేసులు పరిష్కారం అయినట్లు జడ్జి కిషోర్ కుమార్ తెలిపారు. ఇందులో 67 క్రిమినల్, రెండు మనీ సివిల్, మూడు సివిల్ ట్రైల్, ఒకటి చెక్ బౌన్స్, 6 ప్రీలిటికేషన్స్, 134 సమ్మరీ ట్రైల్ కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు. లోక్ అదాలత్ మెంబర్ టి.వెంకటేశం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టిఆర్ జగన్నాథ్ రెడ్డి, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది భారతీదేవి తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన మెగా లోకాదాలత్‌లో 281 కేసులు పరిష్కారం అయినట్లు జడ్జి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఇందులో ఐపిసి సిసి 35, ఎంసీ 1, ఓఎస్ 1, ఎస్ టి సి 223 మొత్తం 281 కేసులు పరిష్కరించి 5,36,590 లక్షల రూపాయలు విలువ గల కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. బార్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, సెక్రెటరీ శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు కష్ణమూర్తి, నరసింహులు, బాల మురళి, నాగశేషు, చంద్రుడు, తిరుపేలు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.


కోవెలకుంట్ల : కేసులను పరిశీలిస్తున్న జడ్జి అబ్దుల్ రెహమాన్


ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శైలజ


ఆత్మకూర్ : విచారిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు


బనగానపల్లె : కేసులను పరిశీలిస్తున్న జడ్జి కిషోర్ కుమార్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండలంలోని గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు, వాలంటరీలకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే శాసనసభ ఎన్నికల్లో వైసిపిని విజయ పథాన నడిపించేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుండి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 32 సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతున్న టిడిపి నాయకులు ఎలాంటి అభివృద్ధి జరగలేదని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ పరిశీలకులు అబ్దుల్ ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా సమయంలో కూడా పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, బనగానపల్లె మండల కన్వీనర్ గుండం నాగేశ్వర రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ మానసవీణ, జడ్పిటిసి లక్ష్మీ సుబ్బమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, వైస్ చైర్మన్ సన్నల జనార్దన్ రెడ్డి, కుర్ణి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్యామలాదేవి, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, పిఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, జిల్లెల్ల శివరామిరెడ్డి, కోడూరు రామచంద్రారెడ్డి, చెర్లో కొత్తూరు చిన్నపరెడ్డి, ఈశ్వర్ నాయక్, ఇల్లూరు కొత్తపేట సర్పంచ్ రమణ, తమ్మడపల్లె సర్పంచ్ వెంకటరామిరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

శ్రీశైలంలో భక్తుల ఉచిత సేవలకు టోల్ ఫ్రీ నెంబర్లు

జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం మహా క్షేత్రంలో శివరాత్రి పర్వదిన సందర్భాన్ని పురస్కరించుకొని 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తెలుపుకోవచ్చని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తాగునీరు, వైద్య సదుపాయం, ట్రాఫిక్ తదితర అత్యవసర సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్లు 08524-287004, 08524-287288, 08524-287289లకు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భక్తులు అసౌకర్యానికి గురైనా, పాదయాత్రలో అవాంతరాలు ఏర్పడినా, బంధుమిత్రులు తప్పిపోయినా, ప్రమాదవశాత్తు వైద్య సహాయం, అత్యవసర సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేస్తే సంబంధిత శాఖలకు సమాచారాన్ని చేరవేసి అవసరమైన సహాయాన్ని అందించేలా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మద్దిలేటి స్వామి ఆలయానికి రూ.7.76 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామం సమీపంలో వెలిసిన మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం రూ.7,76,687 రూపాయలు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ బి సీతారామ చంద్రుడు తెలిపారు. భక్తులు వివిధ మొక్కుబడులు, సేవలు రూపంలో స్వామివారికి ఈ మొత్తాన్ని చెల్లించినట్లు తెలిపారు. జమ్మలమడుగు చెందిన వెంకట సుధామణి, మదన ప్రసాద్ దంపతులు 28 గ్రాముల బంగారు గొలుసు స్వామివారికి సమర్పించినట్లు పేర్కొన్నారు.

బాలుడిపై వీధి కుక్క దాడి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన కొలిమిగుండ్లలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. కొలిమిగుండ్లలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న భాస్కర్ కుమారుడు సంజీవ కుమార్ (3) ఇంటి బయట ఆడుకుంటుండగా అటుగా వెళుతున్న కుక్క దాడి చేసి గాయపరిచింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు కుక్కను తరిమి బాలుడిని తాడిపత్రి వైద్యశాలకు తీసుకెళ్లారు.

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

ప్రజాశక్తి -ప్యాపిలి

మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలకు నేడు డోన్ డిఎస్పీ ఆధ్వర్యంలో ప్యాపిలి పోలీస్ స్టేషన్‌లో వేలంపాట నిర్వహిస్తున్నామని ఎస్ఐ రాకేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ డోన్ సబ్ డివిజన్ ప్యాపిలి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మద్యం (ఎక్సైజ్ ,సారాయి) కేసులలో పట్టుబడిన వాహనాలు వేలంలో దక్కించుకున్న వారు మొత్తం డబ్బుతో పాటు జీఎస్టి కూడా చెల్లించాలన్నారు. మొత్తం 11 బైక్‌లకు వేలం వేయనున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఎస్ఐ

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని లక్ష్మీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న 25 మైనార్టీ కుటుంబాలు వైసిపిని వీడి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో శనివారం చేరారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి వీరికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో మైనార్టీలకు సముచిత స్థానం ఇస్తామన్నారు. టిడిపి పాలనలోనే మైనార్టీల అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేసిన ఘనత ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమ పథకాలను తొలగించిందని చెప్పారు. మైనార్టీ నాయకులు షఫీవుల్లా, రఫిక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానం ఆలయ అభివృద్ధికి ముంబైకి చెందిన జె.హనుమంతు, కుటుంబ సభ్యులు రూ. 50,001 విరాళం శనివారం అందజేశారు. విరాళం నగదును ఆలయ ఈవో రామానుజన్‌కు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని హరినగరం మెట్ట దగ్గర శనివారం కారు, మోటర్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. ఆళ్లగడ్డలోని రామలక్ష్మి కొట్టాలకు చెందిన షేక్ ఫకీర్ భాష హరినగరం గ్రామంలో చేపలు కొనుగోలు చేసేందుకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఆళ్లగడ్డ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఫకీరు భాషకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని రుద్రవరం 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రూ 4.50 లక్షలతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆర్.కొత్తూరు-రుద్రవరం గ్రామాల మధ్య రూ.4.50 లక్షల నిధులతో రోడ్డు మరమ్మతు పనులు శనివారం చేపట్టారు. ఆర్.కొత్తూరు గ్రామ సమీపంలోని అక్కడక్కడ రోడ్డు దెబ్బ తినడంతో అధికారులు కొత్త రోడ్డు నుంచి రుద్రవరం సమీపంలోని పడమటి వీధి వరకు దాదాపు 2 కిలోమీటర్ల పొడవున మరమ్మతులు చేపట్టారు.

ఇష్టపడి చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి - బనగానపల్లె

ఇష్టపడి చదివితే విజయం సొంతమవతుందని కంకరగుర్రెడ్డి విద్యాసంస్థల అధినేత కంకర రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కంకరగుర్రెడ్డి జూనియర్ కళాశాలలో వెల్కమ్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2022 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సదాశివమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి ఇష్టపడి చదవాలన్నారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి

బాలసదనం చిల్డ్రన్ హోమ్‌లో కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని బాలసదనం చిల్డ్రన్ హోమ్‌లో నంద్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఇన్స్టిట్యూట్ ఐ క్యాంప్ వారు శనివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు 25 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు విజయకాంత్ రెడ్డి, బాలసదనం సూపరింటెండెంట్ రోజా రాణి మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు ప్రేమ సాగర్, డాక్టర్ దేవయ్య, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గుర్రప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు :** వెలుగోడు పట్టణంలోని క్రాంతి వికలాంగుల పాఠశాలలో వెలుగోడు మండల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మునీరుద్దీన్, నాగశేషులు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో మానసిక, వికలాంగులైన విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అవసరమైన విద్యార్థులకు రెడ్ క్రాస్ సొసైటీ తరుపున త్వరలో కంటి అద్దాలు అందజేస్తామని సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కరిముల్లా, అమీర్, ఎల్.వి.ప్రసాద్ క్యాంప్ కో ఆర్డినేటర్ ప్రేమ్ సాగర్, దేవాయ, టెక్నీషియన్స్ సాయి ప్రసాద్, సుభాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డ: చిన్నారికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


వెలుగోడు : కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ చీమల రమేష్ రాయల్


ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డితో చీమల రమేష్ రాయల్

ప్రజాశక్తి - శిరివెళ్ల

వైసిపి సోషల్ మీడియా శిరివెళ్ల మండల కన్వీనర్‌గా చీమల రమేష్ రాయల్ ఎన్నుకున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అభివద్ధి రథ సారథి, పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సంక్షేమ ప్రదాత సీఎం జగన్. తమ పై ఉంచిన భాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని శిరివెళ్ల మండల సోషల్ మీడియా కన్వీనర్ చీమల రమేష్ రాయల్ పేర్కొన్నారు. వైసిపి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా తనను ఎన్నుకున్నందుకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, యువ డైనమిక్ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో అధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ నెల 11 నుండి సంక్షేమ ఫలాలు అందుతున్న ప్రతి ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగనన్న' నినాదంతో స్టిక్కర్లను అంటించనున్నామని తెలిపారు.

బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణాన్ని ఇంజనీర్ అధికారులు తనిఖీ

- బీమ్ స్లాప్‌లో తేడా గుర్తించి పునఃనిర్మాణం

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండలం లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టులో చేపట్టిన క్యాంటి లివర్ బీమ్‌లో ఇంజనీరింగ్ అధికారులు తేడా గుర్తించడంతో వారి సూచన మేరకు పునఃనిర్మించారు. విద్యార్థినుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించేందుకు పాఠశాలల మైదానంలో బాస్కెట్ బాల్ కోర్టులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా పగిడ్యాల మండలం లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టును నిర్మించారు. అయితే బాస్కెట్ బాల్ కోర్టు క్యాంటీ లివర్ బీమ్ స్లోప్‌లో తేడా వచ్చింది. శనివారం సంబందిత ఇంజనీరింగ్ అధికారులు తనిఖీలు చేపట్టి క్యాంటి లివర్ బీమ్ స్లోప్ తేడాను గమనించి దగ్గరుండి తొలంగించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో బాస్కెట్ బాల్ కోర్టు క్యాంటి లివర్ బీమ్ స్లోప్‌ను నాణ్యతతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు.


పునర్నిర్మాణం చేస్తున్న బాస్కెట్ బాల్ బీమ్

మైనార్టీలకు అండగా ఉండేది టిడిపినే

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

మైనార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు పరిచి, వారి అభివృద్ధి కృషి చేసింది నాడు తెలుగుదేశం ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మోమిన్ నగర్‌లో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం వాటిని తొలగించిన విధానం ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జెట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం భాష. శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి . ప్రముఖ న్యాయవాది గోవిందరెడ్డి. నాయకులు షఫీవుల్లా. నాగూర్ ఖాన్. పుల్లారెడ్డి. తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎలక్షన్లలో ఇంటికి పంపించాలని టిడిపి మండల నాయకుడు మునీశ్వర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి లొడ్డ శేఖర్ ప్రజలను కోరారు. మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించి టిడిపికి పట్టం కట్టాలని కోరారు. బుక్కాపురం లక్ష్మన్న మాధవ్, కానాల అంజి, భరత సింహారెడ్డి, గుడిసె మద్దిలేటి, నల్లారెడ్డి, బుక్కాపురం ఎర్రమల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే ఎస్సీలు, బీసీలు అభివృద్ధి చెందుతారని ఆ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల సురేష్ రెడ్డి, పిట్టం రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని ఈర్నపాడు గ్రామంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, శ్రీనివాసులు, కోట శివయ్య, బైరెడ్డి సుబ్బారెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, జాకీర్ ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మకూరులో ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే


బండి ఆత్మకూరు : ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

హజ్ యాత్రకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - నంద్యాల

2023 సంవత్సరానికి హజ్ యాత్రకు వెళ్లాలనుకునే నంద్యాల, పరిసర ప్రాంత ముస్లిం ప్రజానీకం ఈ నెల 10వ తేదీ నుండి మార్చ్ 10వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నేషనల్ విద్యా సంస్థల అధినేత, నంద్యాల జిల్లా హజ్ సేవా సమితి అధ్యక్షులు డా. యస్. ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొదటి కేటగిరీ కింద 70 సంవత్సరాలు వయసు పైబడిన వారు, రెండవ కేటగిరీ కింద భర్త మరణించిన లేదా భర్త లేని స్త్రీలు(45 సంవత్సరాలు పైబడిన వారు), మిగిలిన వారు జనరల్ కేటగిరీ కింద ఎంపికకు పరిగణించబడతారన్నారు .ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనే వారు నేషనల్ డిగ్రీ కళాశాలలో గత 20 సంవత్సరాలుగా ఉన్న హజ్ యాత్రికుల ఉచిత సేవా కేంద్రంను సోమవారం నుండి మార్చి 10 వ తేదీ వరకు అన్ని పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు డిసెంబర్ 2023 వరకు గడువు గల డిజిటల్ (మెషీన్ రీడబుల్) పాస్పోర్ట్, బ్యాంక్ అకౌంట్ పాస్బుక్ మొదటి పేజీ , ఆధార్ కార్డ్, కోవిడ్ వాక్సినేషన్ సర్టిఫికెట్, ఓటిపి కొరకు మొబైల్ , 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, నామినీ వివరాలు, 300 రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజుతో సేవాకేంద్రాన్ని సంప్రదించి హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9949227126, 8639006896 ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.


మాట్లాడుతున్న ఇంతియాజ్ అహ్మద్

13 నుండి ప్రాజెక్టుల సందర్శన : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 13 నుండి 24వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సందర్శన నిర్వహిస్తున్నామని, ఈ సందర్శనకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ నాయకత్వంలో ప్రతినిధి బృందం వస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు తెలిపారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాఆరు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఉమ్మడి జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లాలో ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, సిద్దేశ్వరం ప్రాజెక్టులను పరిశీలించనున్నట్లు తెలిపారు. రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ సోమన్న, సిపిఐ పట్టణ నాయకులు డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

In the court of the II Addl. DIST. JUDGE : Kurnool At Adoni

I.A.NO. 2/2023 IN A.S.NO. 37/2019

Between:-
Lakshmi Reddy ....Appellant

Versus

1)Janardhan
2)Suseelamma
...respondents

NOTICE

పై కేసులో కనబరచిన Appellant, ఇద్దరు ప్రతివాదులపై అప్పీలు వేసియున్నారు. పైన తెలిపిన ప్రతివాదులలో 2 వ ప్రతివాది అయిన మీరు 27-02-2023 వ తేదీన ఖుద్దున గాని లేదా వకీలు ద్వారా కాని హాజరు అయ్యి సమాధానము వేసుకోవలసినదిగా తెలియజేయడమైనది. అట్లు చేయని యెడల కోర్టు వారు మీకు విరుద్ధముగా తీర్పు ఇవ్వగలరని తెలియజేయడమైనది.

Moinuddin Patel
T.L.V.S. Sharma
Advocates for Apllellant